క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అదాలత్ కూడలి, కోర్టు వెనుక ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, పద్మాక్షికాలనీ, రాజ్‌పుత్ వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి ఎంఈఓగా రాజిరెడ్డి



హసన్‌పర్తి: మండల విద్యాశాఖ అధికారిగా రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రాజిరెడ్డి మడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన రవీందర్ అనారోగ్య సమస్యలో మృతి చెందగా ఎంఈఓ పోస్ట్ ఖాళీ ఏర్పడింది.

ఆకాశవాణి వార్షికోత్సవం



హన్మకొండ చౌరస్తా: ఆకాశవాణి వరంగల్ కేంద్రం 35వ వార్షికోత్సవాన్ని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి క్యాజువల్ అనౌన్సర్లు, కాంపెరర్లు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోటె చిరంజీవి, సదానందం, ఎల్లయ్య, పరంకుశం, శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూలే విదేశీ విద్యాజ్యోతి పథకంలో బీసీ కోటా పెంచాలి



కేయూ క్యాంపస్: పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థుల సంఖ్యను పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సంవత్సరం సుమారు 300 మంది బీసీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్నారని అన్నారు. ఆ సంఖ్యను వెయ్యికి పెంచి ఈ పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలో గౌరీశంకర ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



వరంగల్: జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, డిప్యూటీ సీఈఓల సంక్షేమ సంఘం నూతన డైరీని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, డిప్యూటీ సీఈఓ వసుమతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శిగా వినయ్‌కుమార్



ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా శ్రీరామోజు వినయ్‌కుమార్ ఎన్నికయ్యారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి లక్ష్మి, కోశాధికారి నర్సింగరావు పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా గుళ్లపెల్లి వివేక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామోజు వినయ్‌కుమార్, కోశాధికారిగా శరత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

కుంభమేళాకు వెళ్లిన 337 మంది యాత్రికులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ నుంచి కుంభమేళాకు 337 మంది యాత్రికులు సోమవారం ప్రత్యేక రైళ్లో తరలివెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి – వారణాసికి వెళ్లే ప్రత్యేక రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగా, జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 337 మంది యాత్రికులు తరలివెళ్లినట్లు అధికారులు తెలిపారు. రైలు వద్ద యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా కాజీపేట ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు, కమర్షియల్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మెట్టు రామలింగేశ్వర ఆలయం ముస్తాబు



మెట్టుగుట్టపై వేసిన చలువ పందిళ్లు



విద్యుత్‌కాంతులీనుతున్న మెట్టుగుట్ట ఆలయం

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 24నుంచి ఉత్సవాలు ప్రారంభం

మడికొండ: మహాశివరాత్రి ఉత్సవాలకు కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయం, శివకేశవాలయాల్లో చలువ పందిళ్లు వేసి ఆయా ఆలయాలకు రంగులు వేసి లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి రోజు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి అర్చనలు, అభిషేకాలు, హోమాలు, రాత్రి 8గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

శివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మడికొండ: మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్లను కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలు ఈనెల 24 నుంచి మార్చి 4వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అదనపు కలెక్టర్ రమాదేవి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత, అధికారులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు

కేయూ క్యాంపస్: పిల్లలు ఎక్కువగా హ్యూమన్ ట్రాఫికింగ్ బారిన పడుతున్నారని, తల్లిదండ్రులు అపరిచితులను నమ్మి మోసపోవద్దని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి సూచించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమంలో అనితారెడ్డి మాట్లాడారు. ఇంటర్నెట్‌ను మంచికే వినియోగించుకోవాలని, వ్యక్తిగత వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని అన్నారు. సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని అన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, ఉమెన్స్ సెల్ ఆఫీసర్ శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనితారెడ్డి, పక్కన ఏసీపీ

రైల్వే గేట్‌ను ఢీకొట్టిన బస్సు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ (ఆర్పీఎఫ్) పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పల్ రైల్వే గేట్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సును కాజీపేట ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌కు సోమవారం తరలించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం హుజురాబాద్ – కమలాపూర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు రైల్వే రూల్స్ పాటించకుండా ఉప్పల్ రైల్వే గేట్‌ను ఢీకొట్టిన ఘటనలో బస్సు డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యారణ్యపురి: విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏకశిల కాన్సెప్ట్ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణకు పాఠశాల విద్యార్థులతో కూడిన ప్రహరీ క్లబ్‌ను సోమవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ నాశనం అవుతుందని అన్నారు. అనంతరం, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రొఫెసర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘నిరసన’ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 19న వరంగల్ హెడ్ పోస్టాఫీస్ జంక్షన్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో న్యూడెమోక్రసీ నేత రాచర్ల బాలరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో రవి మాట్లాడారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ఈక్రమంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పనాస ప్రసాద్, రత్నమాల, నర్రా ప్రతాప్, యాదగిరి, వల్లం దాస్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

కాజీపేట అర్బన్: మతిస్థిమితం లేక తప్పిపోయిన తల్లిని ఆమె కుమారుడికి సఖి సిబ్బంది సోమవారం అప్పగించారు. హనుమకొండ సుబేదారిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ హైమావతి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 15న రాత్రి 10 గంటలకు హనుమకొండ లష్కర్‌బజార్ ప్రాంతంలో 50 ఏళ్ల మహిళ మతిస్థిమితం లేక రోడ్డుపై తిరుగుతున్నట్లు సఖి వన్‌స్టాప్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్ 181కు కాల్ వచ్చింది. హనుమకొండ పోలీసుల సాయంతో సదరు మహిళను సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు తీసుకొచ్చి వసతి కల్పించారు. మరుసటి రోజు కౌన్సెలింగ్ ఇవ్వగా, ఆమె చెప్పిన వివరాల ఆధారంగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన సమ్మక్కగా గుర్తించారు. అనంతరం ఆమె కుమారుడు రాజుకు సమాచారం అందించి అప్పగించారు.



సమక్కను రాజుకు అప్పగిస్తున్న సఖి సిబ్బంది

జోరుగా పుచ్చకాయల కొనుగోళ్లు



కాజీపేట: వేసవి తాపం అప్పుడే ప్రారంభమైంది. వారం క్రితం వరకు గిలిగింతలు పెట్టిన చలి కనుమరుగైంది. రథసప్తమి అనంతరం భానుడు అప్పుడే తన ప్రభావం చూపడం ఆరంభించాడు. దాంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనాన్నిచ్చే ఫలాలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. వేసవి పండ్లలో ఒకటైన పుచ్చకాయ విక్రయాలు వరంగల్ నగరంలో జోరుగా కొనసాగుతున్నాయి. రహదారులకు ఇరువైపులా రాశులు పోసి వ్యాపారులు అమ్ముతున్నారు. ప్రజలు వాటిని కొనడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ప్రారంభ సమయం కావడంతో కిలో రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు కాయ పరిమాణాన్ని బట్టి అమ్ముకాలు చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ముక్కలుగా కోసి విక్రయిస్తున్నారు.

26న బీసీ ముస్లింల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌మహ్మద్

నయీంనగర్: బీసీ కుల జనగణనలో బీసీ ముస్లిం ఏ, బీ, ఈ గ్రూపుల జనాభాకు అన్యాయం జరిగిందని, కొన్ని కులాలను లెక్కించలేదని సమన్వయకర్త డాక్టర్ ఎండీ.రాజ్‌మహ్మద్ అన్నారు. ఈ క్రమంలో బీసీ ముస్లిం ఏ, బీ, ఈ గ్రూపులు ఏకమై తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 26వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ముస్లింలు మైనార్టీలో భాగమే అయినా మైనార్టీ హోదా కల్పించలేదని వాపోయారు. సంచార ముస్లింలను కలిపితే జనాభా 40 లక్షలు దాటుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, ఎండీ.సత్తార్, నయీం, యాకూబ్, కరీమా, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

మడికొండ: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా శోభాయాత్ర, బైక్ ర్యాలీ వాల్‌పోస్టర్లను హిందూ వాహిని రాష్ట్ర విభాగ్ సంయోజక్ ఎర్రగొల్ల ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆధ్వర్యంలో మెట్టుగుట్టపై సోమవారం ఆవిష్కరించారు. 19వ తేదీన కడిపికొండ బ్రిడ్జి సెంటర్ నుంచి బైక్‌ర్యాలీ ప్రారంభమై వరంగల్ పోచమ్మ మైదాన్ వరకు కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో హిందూ వాహిని మడికొండ సంయోజక్ దారంగుల రాజేష్, పానగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, కొప్పిరాల శైలశ్రీ, బుర్ర రాజన్‌బాబు, నిఖిల్‌రావు, అజయ్, మౌళి, బుర్ర నరేష్, రాజేందర్, వినోద్, కుమార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని వినతులు

హన్మకొండ అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతూ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్యను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెలరోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలల హాస్టళ్లల్లో సర్వే చేయగా మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తేలిందని పేర్కొన్నారు. ఈక్రమంలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

వీఏఓపై చర్య తీసుకోవాలి

సంఘం సభ్యులు నెలవారీగా చెల్లించే డబ్బులను తమ సొంత అవసరాలకు వాడుకుంటున్న వీఏఓపై చర్య తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేసి, అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించి తమ గోడు చెప్పుకున్నారు.

జీవనోపాధికి రుణం ఇప్పించండి

వికలాంగుడినైన తనకు జీవనోపాధి కోసం రుణం మంజూరు చేయాలని నగరంలోని కుమార్‌పల్లికి చెందిన బానోత్ రవికుమార్ వేడుకున్నారు. ఈమేరకు కలెక్టర్‌లో గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జీవనోపాధి కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశానని గుర్తుచేశారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ సెంటర్: మార్చి 5 నుంచి 22 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని, సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 92402 05555కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఇంటర్ విద్యాశాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధైర్యం చెప్పాలన్నారు. సమయానికి విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వైద్య సిబ్బంది ఫస్ట్ ఎయిడ్ శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,321 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. వారికి 26పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు ఉంటాయని అన్నారు. ప్రథమ సంవత్సరం, జనరల్ విద్యార్థులు 4,967 మంది, ఒకేషనల్ 848 మందితో కలిపి మొత్తం 5,815 విద్యార్థులు ఉన్నారని వివరించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,739 మంది, ఒకేషనల్ విద్యార్థులు 767 మందితో కలిపి మొత్తం 6,506 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తంగా 12,321 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్ఓ మాడభూషి విజయలక్ష్మి, డీఆర్‌డీఓ అధికారి కౌసల్య దేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కేసును ఉపసంహరించుకోవాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

వరంగల్: ఆజంజాహి మిల్లు కార్మిక భవన స్థలంపై పోరాటం చేస్తున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలపై వస్త్ర వ్యాపారి ఓం నమశ్శివాయ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆజంజాహి మిల్లు కార్మికుల స్థలం, కార్మిక భవనం కూల్చివేత సంఘటనపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ఆ స్థలం రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుని కార్మికులపరం చేయాలని తీర్మానం చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే అన్ని పార్టీలతో కలిసి సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎంసీపీఐ(యూ), ఇఫ్టూ, టీపీఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు రత్నమాల, రమేష్, రామస్వామి, సాగర్, నర్రా ప్రతాప్, అక్కెనపల్లి యాదగిరి, నున్నా అప్పారావు, కొంపెల్లి ప్రవీణ్, జనగాం కుమారస్వామి, చుక్క శ్రీను, నరసింహారావు, హరిబాబు, ఏజే మిల్ కార్మికుల సంఘం నాయకులు ఇనుముల శ్రీనివాస్, డాక్టర్ కె.కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, ఆర్ఎస్పీ నాయకులు వల్లం దాస్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అవకతవకలు



బుక్‌లెట్ విడుదల చేస్తున్న ఎస్ఐఓ ప్రతినిధులు

నయీంనగర్: 2024 – 25 ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.300 కోట్లు కేటాయించినా అందులో కేవలం 41.86 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇంకా 1.2 లక్షల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జక్రియా సోహెల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మన్నాన్ తెలిపారు. దాంతో అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యావ్యవస్థలో అడ్డంకులు ఏర్పడుతున్నాయని వాపోయారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యా, యువజన సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులపై సిఫార్సులు చేస్తూ తెలంగాణ ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంక్షేమం మాటల్లో కాకుండా బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా చూపించాలని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సమయానికి, పారదర్శకంగా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫరాజ్, హసీబ్, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థినుల ప్రతిభ

ఖిలా వరంగల్: సుచిరిండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి పరీక్షలో కరీమాబాద్ రోడ్డుకు చెందిన న్యూ కౌటిల్యాస్ ఎస్ఏ హైస్కూల్ విద్యార్థినులు డి.రిషిత రాష్ట్ర స్థాయి, ఎం.పూర్వజ మౌర్య జిల్లా ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో అతిథుల చేతుల మీదుగా సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్, ప్రశంస పత్రాలను అందుకున్నారు. పాఠశాలలో ఆ విద్యార్థినులను స్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు కోడం సబిత, ఐఐటీ బోధన సిబ్బంది దయాకర్, కెమిస్ట్రీ టీచర్ మహేశ్వర్, బయాలజీ టీచర్ నాగరాజు సోమవారం అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



కాజీపేట ఫాతిమా కూడలిలో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద మొక్క నాటుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



72కిలోల కేక్ కట్ చేసి మాట్లాడుతున్న వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



వరంగల్ ఆర్టీఏ జంక్షన్ వద్ద తల్వార్‌తో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను నగర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు కేకులు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేసీఆర్ ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గుర్తుచేశారు. - సాక్షి నెట్‌వర్క్

తాగునీరు రోడ్డుపాలు

నగరంలోని ముఖ్య రహదారి అయినా ఓల్డ్ బస్ డిపో రోడ్డు నుంచి సుమంగళికి వెళ్లే దారిలో తిరుమల సర్కిల్ దగ్గర తాగునీటి పైపులైన్ లీకేజీ అయింది. దాంతో నెల రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - హన్మకొండ

